andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.8 । కనిష్ఠం 27.2

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

మంగళవారం 15 జూలై 2025



వన సంరక్షణ సమితి అధ్యక్షుడిగా లక్ష్మణ్

నేరడిగొండ, జూలై 14(ఆంధ్రజ్యోతి): వనసంరక్షణ సమితి మండల అధ్యక్షుడిగా ఆత్రం లక్ష్మణ్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని కుమారి గ్రామంలో గల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారుల సమక్షంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. కాగా వన రక్షణ సమితి అధ్యక్షుడిగా ఆత్రం లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా నడికుంటి నరసమ్మలతో పాటు 16మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో గల అటవీ సంరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ఆత్రం లక్ష్మణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వచ్చి రాని.. వైద్యం!


జిల్లాలో వచ్చిరాని వైద్యంతో.. ఆర్‌ఎంపీలు రెచ్చిపోతున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వైద్యులు నకిలీ వైద్యంతో తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఎంతో కొంత వైద్యవృత్తిలో అనుభవం ఉంటే చాలు మాయ మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ఎలాంటి డిగ్రీలు, వైద్య పరిజ్ఞానం లేకున్నా శస్త్ర చికిత్సలు చేసేందుకు సైతం వెనుకాడడం లేదని తెలుస్తుంది. ముఖ్యంగా ఏజెన్సీ మారుమూల గ్రామాలలో ఆర్‌ఎంపీలు, కంపౌండర్లు అడ్డగోలుగా వైద్యం చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు.



● పొచ్చెర గ్రామంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- జిల్లాలో అమాయక ప్రజలే టార్గెట్‌గా సాగుతున్న దందా
- నకిలీ వైద్యంతో రెచ్చిపోతున్న ఆర్‌ఎంపీలు, కంపౌండర్లు
- రోగులను మభ్యపెడుతూ అడ్డగోలుగా దోపిడీ
- తాజాగా బోథ్ మండలంలో ఓ ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్
- ఫిర్యాదు చేస్తేనే వైద్య ఆరోగ్య శాఖ హడావిడి

ఆదిలాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): రోగం సంగతి దేవుడెరుగు గానీ, కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తూ కమీషన్‌లతో ఆర్‌ఎంపీలు, కంపౌండర్లు జేబులు నింపుకుంటున్నారు. గతంలో ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, తాంసి మండలాల్లో పలువురు ఆర్‌ఎంపీలు స్థాయికి మించిన వైద్యం చేసి జైలుకు వెళ్లారు. తాజాగా బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌ను వైద్య ఆరోగ్య శాఖాధికారులు సీజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ ఆర్‌ఎంపీ ప్రమాదకర ఇంజక్షన్‌లతో వైద్యం చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. ఇలాంటి పరిస్థితులే జిల్లాలో చాలా గ్రామాల్లో కనిపిస్తున్నా.. వైద్య ఆరోగ్య శాఖాధికారులు మాత్రం ఫిర్యాదు చేస్తేనే హడావిడి చేయడం విమర్శలకు దారి తీస్తుంది.



వారు ఇచ్చిందే మందు

మారుమూల గ్రామాల్లో కొంత మంది ఆర్‌ఎంపీలు ఇచ్చిందే సూదిమందు.. చెప్పిందే రోగంగా మారింది. ఏదో చలిజ్వరం, దగ్గు, జలుబు, కడుపునొప్పి లాంటి చిన్న పాటి వ్యాధులకు సూదిమందు ఇచ్చే ఆర్‌ఎంపీలు, కంపౌండర్లు బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తూ విచ్చల విడిగా వైద్యాన్ని అందిస్తున్నా రు. కొన్ని సందర్భాల్లో వైద్యం వికటించి ప్రాణాల మీదికి వస్తున్నా.. మధ్యవర్తులను రంగంలోకి దింపుతూ బయటకు పొక్కనివ్వడం లేదు. ఇప్పటికే ఆర్‌ఎంపీల ఆగడాలకు పలువురి ప్రాణాలు గాలిలో కలిసిన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, బోథ్, సిరికొండ, ఇచ్చోడ, బేల, బజార్‌హత్నూర్, తాంసి, భీంపూర్ మండ లాల లోని మారుమూల గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు తరుచూ వెలుగు చూస్తునే ఉన్నాయి. ఇటీవల కాలంలో కొందరు వైద్యులు ఆయుర్వేదం పేరిట చెట్ల మందులిస్తామని భారీగా వసూలు చేస్తున్నారు. అలాగే వాతలుపెడితే కాళ్లనొప్పులు, కీళ్లనొప్పులు అట్టే మాయమైపోతయని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇకనైన అధికారులు నాటువైద్యం నకిలీ వైద్యులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తే కొంతమేరకైన ప్రజల ప్రాణాలను కాపాడవచ్చన్న వాదనలు వినపడుతున్నాయి. ముఖ్యంగా స్థాయికి మించిన వైద్యం, హైడోస్‌తో కిడ్నీ సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది.

నిరంతరంగా పర్యవేక్షణ చేస్తున్నాం..

: రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్



జిల్లాలో స్థాయికి మించి వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై నిరంతరంగా నిఘాను సారిస్తున్నాం. ఆర్‌ఎంపీలు ఫస్ట్ ఎయిడెడ్ వైద్య సేవలను మాత్రమే చేయాల్సి ఉంది. హైడోస్ మందులను వాడడంతో ప్రజలు భయంకరమైన వ్యాదుల భారీన పడుతున్నారు. ముఖ్యంగా కిడ్నీ రోగుల సంఖ్య పెరిగి పోతోంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్

ఏ చిన్నపాటి రోగం వచ్చిన కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులు ఆర్‌ఎంపీ వైద్యులకు కమిషన్ ఆశ చూపుతూ రోగులను అడ్డగోలుగా దోచుకుంటున్నాయి. ప్రధానంగా కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ పట్టణ ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నారు.అసలే నయంకాని వ్యాధులకు సైతం చికిత్సలు ఉన్నాయంటూ నమ్మబలుకు తున్నారు. అలాగే పొరుగున్న ఉన్న మహారాష్ట్రలోని యవత్‌మాల్, నాగ్‌పూర్ ప్రాంతాలకు సైతం రోగులను తరలిస్తు వైద్యాన్ని అందిస్తున్నారు. అంతేకాకుండా జిల్లా కేంద్రంలో రిమ్స్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నా.. దూర ప్రాంతాలకు వైద్యం కోసం రెఫర్ చేస్తున్నారు. ముందే కార్పొరేట్ ఆసుపత్రులతో ఆర్‌ఎంపీలు ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలుస్తుంది.

ప్రమాదకరంగా వైద్యం

ఆర్‌ఎంపీ వైద్యులు చేస్తున్న వైద్యం పలు సందర్భాల్లో ప్రమాదకరంగా మారుతోంది. వైద్యం వికటిస్తూ ప్రాణాలు గాలిలో కలుస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఇటీవల గుడిహత్నూర్ మండలంలో ఓ మహిళకు గర్భవిచ్ఛిత్తి మందులు ఇవ్వడంతో పరిస్థితి విషమంగా మారింది. అలాగే గ్రామ

(తరువాయి 6వ పేజీలో...)


తెగులు సోకిన సోయా పంట

అప్పుడే సోయాకు ఎల్లో ఫంగస్!

తాంసి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఈ ఏడు సోయా విస్తీర్ణం జిల్లాలో ఘనంగా పెరిగింది. పత్తితో సమానంగా కొంచెం అటు ఇటుగా ధరను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో చాలామంది రైతులు సోయా వైపు మొగ్గు చూపారు. తాంసి మండలంలో ప్రస్తుతం ఈ సంవత్సరం మూడున్నర వేల హెక్టార్లలో ఈ పంట సాగు అవుతోంది. అయితే పంటకు అప్పుడే ఎల్లో కలర్ ఫంగస్ తెగులు సోకింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఆయా గ్రామాలలోని రైతులతో కలిసి పంటలను పరిశీలిస్తున్నప్పటికీ వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు మాత్రం తెగుళ్లపై అంతగా స్పందించడం లేదనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పంటలకు సోకే తెగుళ్లు కేవలం శాస్త్రవేత్తలకే తెలుస్తాయని అంటున్నారు. సోయాకు సోకిన ఎల్లో కలర్ నివారణకు చర్యలు వివరించాలని కోరుతున్నారు.

ఐటీడీఏ బీఎడ్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు : పీవో

ఉట్నూర్, జూలై14 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో కొనసాగుతున్న బీఎడ్ కళాశాలలో 2025-27 రెండేళ్ల విద్యా సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తులు తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన గిరిజనులు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. గణితంలో 25, జీవశాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రంలో 35, భౌతిక శాస్త్రంలో 10, ఆంగ్లములో 10 సీట్లు ఉన్నాయని, మొత్తం వంద సీట్లు గిరిజన అభ్యర్థుల కోసమే కేటాయించినందున ఈనెల 16 నుంచి ఆగస్టు 8లోగా దరఖాస్తులను రూ.వందకు కొనుగోలు చేసి పూర్తి చేసిన దరఖాస్తులు సమర్పించాలన్నారు. వివరాల కోసం ఫోన్ నెం. 94408 48073, 850099 5561 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో ఎస్‌ఈ జేఆర్ చౌహాన్

విద్యుత్ అధికారులకు ప్రత్యేక శిక్షణ

ఆదిలాబాద్ రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్‌ముక్తి బిజిలి యోజన పథకంపై విద్యుత్ శాఖాధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జిల్లా ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఎన్‌పీటీఐ బెంగళూరు మినిస్ట్రి ఆఫ్ పవర్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని డివిజనల్ ఇంజనీరింగ్స్, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు, తదితరులు హాజరయ్యారు.

'ఆధార్‌తో యూరియా కొనుగోలు'

తలమడుగు, జూలై 14(ఆంధ్రజ్యోతి): యూరియా కొనుగోలు చేసే రైతులు ఆధార్ కార్డుతో కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని సుంకిడి, తలమడుగు, జరీ, తదితర యూరియా విక్రయ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎరువులపై ఎవరు రైతులు ఆందోళన చెందవద్దన్నారు. విక్రయదారులు ఎవరైనా అక్రమంగా విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా రసీదులు తీసుకోవాలని సూచించారు. ప్రతీరోజు స్టాక్ వివరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. అంతేకాకుండా పంట పొలాలపై రసాయన ఎరువులను ఎక్కువ వాడోవద్దని సూచించారు. అనంతరం రిజిష్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో సీఈవో మోతి శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి

● మాజీ మంత్రి జోగు రామన్న

మావల, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని మాజీ మంత్రి జోగు రామన్న ధ్వజమెత్తారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాటశాలను పరిశీలించారు. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, ఇతరత్రా అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన పూర్తి చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తయిన పనులకు బిల్లులు ఇవ్వక ఇబ్బందులకు గురి చేయడం సరైన విధానం కాదన్నారు. మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, ఎంపీపీ,గండ్రత్ రమేష్, నాయకులు సేవ్వా జగదీష్ యాదవ్, బట్టు సతీష్, కనక రమణ, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన

బజార్‌హత్నూర్,జూలై14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దరి చేరకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సాధన అన్నారు. మండలంలోని వర్తమన్నూర్ గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా కలుషీతం తాగునీటితో పలు ఆరోగ్య సమస్యలు పెరుగుతాయన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ లాంటి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందు చూపు జాగ్రత్తలను వివరించారు. సికిల్ సెల్ స్క్రీనింగ్, గర్భిణి మహిళలకు వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్‌భీంరావ్, సిబ్బంది సుశీల, సంఘవి, ప్రేమల, రమేష్, పార్వతి, సంగీత, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని బుగ్గరాం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ఇళ్ల వద్ద పరిసరాలలో నిల్వగా ఉన్న నీటిని పంచాయతీ సిబ్బంది ద్వారా పారబోయించారు. అంతేకాకుంగా డ్రై డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు సరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట హెల్త్ సూపర్ వైజర్ స్వర్ణలత, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశా కమల, స్వాతి, అంగన్‌వాడీ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.


వర్తమన్నూర్ గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


బుగ్గరాంలో వైద్య చికిత్సలు అందిస్తున్న పవార్ రవీందర్

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన

నేరడిగొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై హ్యూమన్ రైట్స్ టీం చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కుమారీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తిమోతి రమణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం కరోనా వైరస్ కంటే అత్యంత భయంకరమైనదని అన్నారు. డ్రగ్స్ వినియోగం సమాజంలో అతి పెద్ద సమస్యగా మారిందని, ముఖ్యంగా యువత వాటి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిశితంగా పరిశీలిస్తుండాలని కోరారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం వంటివి గుర్తిస్తే 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అమృత్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ సమస్యల పరిష్కారానికి కృషి

బోథ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ సమస్యలను పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్ పేర్కొన్నారు. సోమవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ అనురాధ, సిబ్బంది వివరించారు. విద్యార్థుల సంఖ్య కనుగుణంగా గదులను నిర్మించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

విజయ్‌శర్మకు నాయకుల ఘన నివాళి

ఉట్నూర్, జూలై14 (ఆంధ్రజ్యోతి): యూసీసీఆర్‌ఐఎంఎల్ పార్టీ రాష్ట్ర నాయకులు విజయ్‌శర్మకు మండల కేంద్రంలో సోమవారం గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ యూసీసీఆర్‌ఐఎంఎల్ రాష్ట్ర నాయకులు విజయ్‌శర్మ ఇటీవల కిడ్నీ వ్యాధితో అవస్థలు పడుతూ డయాలిస్‌పై ఉంటూ శనివారం మృతి చెందారన్నారు. జిల్లాలోని ఉట్నూర్, జన్నారం కవ్వాల్ ప్రాంతపు భూపోరాటంలో మార్గదర్శిగా ఉంటూ పేద ప్రజల సమస్యలపై శ్రమిస్తూ తన జీవితాన్ని పేద ప్రజల కోసం అంకిత చేసిన మహోన్నతమైన వ్యక్తి విజయ్ అని ఆయన సేవలను కొనియాడారు. ఇందులో ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ డీఎస్‌వో జిల్లా కార్యదర్శి నేతవత్ జేల్‌సింగ్, నవోదయ తాపీ మేస్త్రి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కాంబ్లె గంగాధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

తాంసి, జూలై 14(ఆంధ్రజ్యోతి): తాంసి మండల కేంద్రంలో సోమవారం ముమ్మరంగా తనిఖీల కార్యక్రమాన్ని చేపట్టారు. కొంతమంది వాహనాలు నడుపుతూ దొడ్డి దారిన పారిపోయేలా చూసినప్పటికీ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.


అర్జీదారుల సమస్యలు వింటున్న ఐటీడీఏ పీవో

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

● గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన ధర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్ల, రైతుభరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగాధర్, ఏపీఓ (పీవీటీజీ) మేస్రం మనోహర్, డీడీ అంబాజిజాదవ్, పీఏహెచ్‌వో సందీప్‌కుమార్, ఏడీఎంహెచ్‌ఓ కుడిమెత మనోహర్, ఆర్సీఓ ఆగస్టియన్, ఏఓ దామోదర స్వామి, మేనేజర్ శ్యామల, డీపీఓ ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

'మాజీ కౌన్సిలర్ల పెత్తనం వద్దు'

ఆదిలాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ప్రారంభోత్సవాల్లో మాజీ కౌన్సిర్ల పెత్తనం వద్దంటూ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పదవీ కాలం ముగిసిన మాజీ కౌన్సిలర్లు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఏ హోదాలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలను చేపడుతున్నారో? తెలియడం లేదన్నారు. అనదికారికంగా చేపడుతున్న కార్యక్రమాలను అడ్డుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఇందిరమ్మ కమిటీలతోనే ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేయాలని అన్నారు.

జొన్న పంట డబ్బులను విడుదల చేయాలి

జైనథ్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులకు సంబంధించిన జొన్న పంట డబ్బులను విడుదల చేయాలని సోమవారం కలెక్టర్‌కు మండల రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఏనుగు రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ జొన్న పంట అమ్మి రెండు నెలలు గడుస్తున్న డబ్బులు ఇంకా అకౌంట్‌లో పడలేవన్నారు. ఇందులో రైతు నాయకులు టి.దత్తు, సాయిప్రసాద్‌లతో పాటు జైనథ్ మండల జొన్న రైతులు పాల్గొన్నారు.

బోథ్: గత నెల రోజుల క్రితం ప్రభుత్వ రంగ సంస్థలను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసిన జొన్న పంటకు సంబంధించిన డబ్బులు ఇంతవరకు రాలేదని, వాటిని అందించే విధంగా చూడాలని సోనాల మండలం బీజేపీ కన్వీనర్ బోర రవీందర్ పేర్కొన్నారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డికి ఈ విషయమై వినతిపత్రం అందించారు. ఇందులో సీనియర్ నాయకులు సుభాష్, సూర్య, మాజీ ఎంపీటీసీ రోహిదాస్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మానాల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సోనాల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

గాదిగూడ ఎస్సైగా ప్రణయ్ బాధ్యతల స్వీకరణ



నార్నూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ ఎస్సైగా పి.ప్రణయ్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. శాంతి భద్రతలకు ప్రాంత ప్రజలు సహకరించాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక పనులు ఎవరూ చేయకూడదు పేర్కొన్నారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

● నూతన ఎస్సైగా బాధ్యతలను స్వీకరిస్తున్న పి.ప్రణయ్ కుమార్



నాలుగంటే నాలుగే..

- ఇచ్చోడ మండలానికి ఆమోదించిన రేషన్ కార్డుల సంఖ్య
- అర్హులింతేనా అంటూ విస్తుపోతున్న జనం
- జిల్లాలో బోథ్ నియోజకవర్గం వెనుకంజ

వివరాలు 7వ పేజీలో...

జీవో49 రద్దు చేయాలంటూ.. 21న ఉమ్మడి జిల్లా బంద్‌కు పిలుపు

● ఆదివాసీ గిరిజన సంఘాల ప్రతినిధులు

ఉట్నూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొమురంభీం ఆసిఫాబాద్ ప్రాంతంలో జీవో 49 ద్వారా ఆదివాసీ గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకం చేస్తున్నందున జీవో 49ని రద్దు చేయాలంటూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు పిలుపు ఇవ్వడం జరిగిందని ఆదివాసీ గిరిజన సంఘాల ప్రతినిధులు గోడం గణేష్, పురక బాపురావులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కలిసి జీవో 49 రద్దు చేయాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రతి గ్రామంలో ఈ నెల 6 నుంచి 13 వరకు గ్రామసభలు నిర్వహించి జీవో49 రద్దు చేయాలంటూ తీర్మాణాలు చేయడం జరిగిందన్నారు. 21న తలపెట్టిన ఉమ్మడి జిల్లా బంద్‌కు ఆదివాసీ గిరిజన సంఘాలు, తుడుందెబ్బ,జిల్లా రాయిసెంటర్, రాజ్‌గోండుసేవా సమితి, కుల సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు బంద్‌కు మద్ధతు ఇస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మేస్రం నాగనాథ్, తులసి నాగోరావు, పెందూర్ దాదిరావు, పంద్ర జైవంత్‌రావులు పాల్గొన్నారు.

'కొలాం భూములు అక్రమంగా పట్టా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నార్నూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): లంబాడి తెగకి చెందిన కొందరు వ్యక్తులు అమాయక కొలాం ప్రజల భూములు అక్రమంగా తమ పేరు మీదా పట్టాలు చేసుకున్నారని, వీటిపై పూర్తిగా విచారణ జరిపించి ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ జడి రజాలింగుకు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సెడ్మేకె రామరావు మాట్లాడుతూ 1950 తర్వాత ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారి కుల సర్టిఫికెట్ రిజర్వేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అర్క గోవింద్, మడావి నటరాజ్, కుమ్ర జయతు ఉన్నారు.

'కాంగ్రెస్‌కు అబ్దుల్ ఖయ్యుం అందించిన సేవలు మరువలేనివి'

ఉట్నూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పార్టీలో చురుకుగా పని చేస్తూ పార్టీ బలోపేతం కోసం నిత్యం పాటు పడిన కట్టర్ కాంగ్రెస్ వాది దివంగత కాంగ్రెస్ పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షులు అబ్దుల్‌ఖయ్యుం అని, వారి మృతి పార్టీకి తీరని లోటని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తిరుమల పంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా వారి మృతిని చింతిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించారు. అనతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 30ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీనే నమ్మి పార్టీ బలోపేతం కోసం చివరి శ్వాస వరకు కృషి చేసిన నేత అబ్దుల్ ఖయ్యుం అని అన్నారు. కాగా, ఎమ్మెల్యే తనవంతుగా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అబ్దుల్ ఖయ్యుం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ఏఎంసీ వైస్ చైర్మన్లు, నియోజక వర్గంలోని జన్నారం, ఉ ట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల ప్రజా ప్రతినిధులు, కాంత్రగెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




ఖయ్యుం కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఆదివాసీల హక్కులను కాపాడాలి

● తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందుర్ దాదిరావు ● జీవో 49 వెంటనే రద్దు చేయాలంటూ వినతి

నార్నూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవో 49ను వెంటనే రద్దు చేయాలని తుడుందెబ్బ జిల్లాలో అధ్యక్షుడు పెందుర్ దాదిరావు అన్నారు. సోమవారం నార్నూర్ తహసీల్దార్ జాడి రాజలింగుకు కారాయల్యం వద్ద సంఘం నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ. వాటిని పరిష్కారం చేయాల్సిన ప్రభుత్వం ఇలాంటి జీఓలు అమలు చేస్తూ తమను ఇబ్బందుల పాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అమయక ఆదివాసుల ఎలాంటి గ్రామ సభలు చేయకుండా 339 గ్రామాల తీర్మాణాలు తీసుకున్నాము మాకు ఎలాంటి అభ్యంతరం లేదు జీఓలో ఉన్న విషయాలు అవస్థం అన్నారు. ఆదివాసుల అమాయకత్వాన్ని అసర చేసి వారిని తరిమివేసి ఖనిజ వనరుల దోపిడీకి చేసే ప్రయత్నం జరగుతుందని ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వ వ్యవహారాన్ని తాము తీవ్రంగా వ్యతేకిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెస్రం మాణిక్ రావు జిల్లా ఉపాధ్యక్షులు, ఆడా శ్రీరాం మండల అధ్యక్షులు, మడావి సాగర్ కార్యదర్శి, మోతీరాం చతుర్భవ్, జంగు పాల్గొన్నారు.



● నార్నూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న తుడుందెబ్బ నాయకులు

సిరికొండ: ఆదివాసీల అస్థిత్వాన్ని దెబ్బతీసే జీవో 49ని తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయా ఆదివాసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో స్థానిక మండల తహసీల్దార్ తుకారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జీవో 49 ఆదివాసీల అస్థిత్వాన్ని దెబ్బతీసే విధంగా ఉందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పోడు భూములను సాగుచేసుకుంటున్న జీవనం సాగిస్తున్న ఆదివాసీ కుటుంబాలను ఈ ప్రాంతం నుండి తరలించే కుట్రలకు తెరలేపుతున్నారనీ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మండల అధ్యక్షులు కుమ్రం యాదవ్ రావ్, కొమురం భీం ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు కోట్నాక్ పాండు, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు పెందూర్ మహేందర్, రాయిసెంటర్ రిమ్మ సార్మేడీ అమృత్ రావ్, మాజీ జడ్పీటీసీ కుమ్రం రఘురాం, నాగోరావ్, మాజీ సర్పంచ్ మడావి లచ్చు, బీర్షా, మహదు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: ఆదివాసీ గిరిజనులకు నష్టం చేకూర్చే జీవో 49ని వెంటనే రద్దు చేయాలని తుడుం దెబ్బ ఆధ్వరంలో తాసిల్దార్ రాజమోహన్ కు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు జంగాల పోచన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 49తో ఆదివాసి హక్కులకు నష్టం చేకూరుతుందన్నారు. భూమికోసం భుక్తి కోసం పోరాటం చేసిన ఆదివాసులకు హక్కులు కోల్పోతారన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరితో ఆదివాసులకు అన్యాయం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఆదివాసులకు కలిగిన భూములు వారికి దక్కకుండా పోతుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో మండల అధ్యక్షుడు జంగాల పోచన్న, ప్రధాన కార్యదర్శి గేడం భుజంగరావు, ఆత్రం కృష్ణ, పేందుర్ శంకర్, ఆడ సోని రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: టైగర్ కన్జర్వేషన్ రిజర్వు ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీవో 49తో జిల్లాలోని గిరిజనులకు, రైతులుకు తీరని అన్యాయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల గౌరవాధ్యక్షుడు జుగ్నాక్ భారత్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనక గణేష్, జిల్లా కార్యదర్శి గేడం భారత్, మండల ప్రధాన కార్యదర్శి సోయం మురహరి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

నేరడిగొండ, జూలై 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం గుడిహత్నూర్ మండలంలోని మాన్కపూర్ గ్రామంలో శ్రీ పోచ్చమ్మ ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షలు, బోథ్ మండలంలోని మామిడి గూడ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు చేయించారు. కాగా, నేరడిగొండ మండల కేంద్రంలోగల తన నివాసంలో ఆయా గ్రామస్థులకు ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని అన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకరావాలని అన్నారు. ఇందులో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● 'అఖండ జ్యోతి'కి హాజరు కావాలి : కజ్జర్ల గ్రామస్తులు

నేరేడిగొండ: ఈనెల 25వ తేదీ నుంచి తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో నెల పాటు జరిగే అఖండ జ్యోతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్‌కు సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. బోథ్ మండలంలోని కంటేగావ్ గ్రామస్తులు ఎమ్మెల్యేకు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామం లో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా స్పందించిన ఆయన సమస్య పరిష్కరానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

బోథ్, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ పాఠశాలలో నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం తపస్ నాయకులు డిమాండ్ చేశారు. మండలాల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్లాల రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించిన బకాయిలను విడుదల చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, సెల్వార్ శ్రీనివాస్ చౌదరి ప్రకాష్, తదితరులున్నారు.

ఐటీడీఏ ముందు నిరుద్యోగుల ధర్నా

ఉట్నూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఏజెన్సీ నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు జాదవ్‌సోమేష్ మాట్లాడుతూ 2012లో ప్రభుత్వం మంజూరు చేసిన 566 ఉపాధ్యాయ పోస్టులను ఇప్పటికీ భర్తీ చేయక పోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం అంటూ పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం పీవోఖుష్బు గుప్తాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెందూర్తి దీపక్, కిషోర్, పోషిరావు, దీపక్, శివ, తదితరులు పాల్గొన్నారు.



బోథ్ మండలంలో ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

వచ్చి రాని.. వైద్యం!

(5వ పేజీ తరువాయి...)

సమీపంలోని వాగులో మృతశిశువు ఆనవాళ్లు దొరకడంతో ఓ ఆర్ఎంపీపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మండల కేంద్రానికి చెందిన ఓ ఆర్ఎంపీ వైద్యుడు శస్త్ర చికిత్స చేయడంతో ఓ యువతికి ఆరోగ్యం విషమించింది. దీంతో అసలు విషయం బయట పడడంతో సదరు వైద్యుడిపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడే అధికారులు హడావిడి చేస్తున్నారే తప్ప నకిలీ వైద్యంపై నిరంతరంగా నిఘా సారించక పోవడంతో గ్రామాల్లో శంకర్‌దాదాలు రెచ్చిపోతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇకనైనా వచ్చిరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హిజ్రా అనుమానాస్పద స్థితిలో మృతి

ఇంద్రవెల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): హిజ్రా అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం రాముగూడ గ్రామానికి చెందిన హిజ్రా టేకం ఆయ్యు(అరుణ) (30) అనే వ్యక్తి ఈనెల 8న ఇచ్చోడకు చెందిన జాధవ్ అర్జున్‌తో కలిసి టేకం ఆయ్యు అతని అక్క వ్యవసాయ చేనులో వెళ్లారు. ఈనెల 9న సాయంత్రం జాధవ్ అర్జున్ గ్రామానికి వచ్చి హిజ్రా టేకం ఆయ్యు (అరుణ) వ్యవసాయ చేనులో చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయాడని గ్రామస్థులకు, టేకం ఆయ్యు అన్న టేకం రాజుకు చెప్పాడు. ఈనెల 10న కుటుంబ సభ్యులు చెట్టుకు ఉరి వేసుకొని ఉన్న టేకం ఆయ్యు మృతదేహాన్ని చెట్టు నుంచి కిందికి దించి పూడ్చి పెట్టారు. హిజ్రాను జాధవ్ అర్జున్ అనే వ్యక్తి చంపినట్టు అనుమానం ఉందని ఆదివారం గ్రామ పటేల్ కుమ్ర రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో పూడ్చిపెట్టిన హిజ్రా మృతదేహాన్ని బయటకు తీసి మృతదేహాన్ని పంచనామా చేశారు. కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్టు సీఐ తెలిపారు.

'ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి'

మావల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ముదిరాజుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తూ వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేలా కృషి చేస్తోందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం భీమన్న దేవుడి పండుగను కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో గల భీమన్న ఆలయంలో నిర్వహించిన పండుగలో ఆయన పాల్గొని భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ కులస్తులు శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గం యొక్క సంస్కృతి, సంప్రదాయాలు మన రాష్ట్ర వైవిధ్యాన్ని చాటుతాయనన్నారు. ఇందులో దారవేణి రాము ముదిరాజ్, దార్ల రవి ముదిరాజ్, బొద్ది సంతోషి ముదిరాజ్, ముదిరాజ్ కులస్తులు, మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

17 నుంచి జిల్లాలో రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు

నిర్మల్ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి 20 వరకు మండలంలోని కొండాపూర్‌లో గల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు స్టార్ మంచిర్యాల డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముఖేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అండర్-19 బాలురు, బాలికలకు సింగిల్స్, డబుల్స్, మిక్స్ డబుల్స్ విభాగాల్లో బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని తెలిపారు. ఈనెల 17న క్వాలిఫైయింగ్ పోటీలు, ఈనెల 18 నుంచి 20 వరకు మెయిన్‌డ్రా పోటీలు ఉంటాయని తెలిపారు. 18న ఉదయం 10గంటలకు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవం ఉంటుందని, కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేతోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారుగా 400 మంది వరకు బ్యాడ్మింటన్ క్రీడాకారులు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్, కోకన్వీనర్ వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్ గౌడ్, మహేష్, ప్రణీత్, నంద కుమార్, పేట సంఘం జిల్లా ప్రెసిడెంట్ భూక్యా రమేష్, తదితరులు పాల్గొన్నారు.



గోరింటాకుతో ఉపాధ్యాయులు, విద్యార్థినీలు

కస్తూర్బాలో గోరింటాకు పండుగ

కుంటాల, జూలై14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు కస్తూర్బా పాఠశాలలో సోమవారం గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినీలు చేతులకు గోరింటాకు పెట్టుకొని పండుగ సంబరాలు నిర్వహించారు.

'బహుజన గణమన' పుస్తక ఆవిష్కరణ

నిర్మల్‌రూరల్, జూలై14 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల్లో చైతన్య స్ఫూర్తి కలిగించేలా ప్రముఖ కవి రచయిత జూలూరి గౌరీ శంకర్ రచించిన 'బహుజన గణమన' అనే దీర్ఘ కవిత సంపుటి పుస్తకాన్ని సోమవారం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఘనంగా ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దామెర రాములు, డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, చిలుక రమణ, డా. వేణుగోపాలకృష్ణ, ఆరేపల్లి విజయ్ కుమార్, నేరెళ్ల హనుమంతు, కత్రోజ్ అశోక్, సిరికొండ రమేష్, బిట్లింగ్ నవీన్, నాగోరావు, తదితరులు ఉన్నారు.

సామాన్యుడికి కూరగాయాలు!

● మంట పుట్టిస్తున్న పచ్చి మిర్చీ ● రెట్టింపు అయిన బీర, సొర, వంకాయ, కాలిఫ్లవర్ ధరలు

ముథోల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. గత నెలతో పొలిస్తే రేట్లు అమాంతం పెరిగిపోయాయి. మిర్చీ మంట పుట్టిస్తుంటే కూరగాయల్లో రారాజైన వంకాయ సామాన్యులకు అందనంత దూరంలో ఉంది. దీంతో కూరగాయలను కొనేందుకు జనం జంకుతున్నారు. ఓవైపు పెరిగిన గుడ్ల ధరలు, మరోవైపు పెరిగిన కూరయగాలను చూసి ఆవేదన చెందుతున్నారు. సంచితో కూరగాయల మార్కెట్‌కు వెళ్లాలంటే హడలిపోతున్నారు సామాన్య జనం. పెరిగిన కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. నెల రోజుల్లో అంతకంతకు పెరిగిన ధరలు వినియోగదారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. పచ్చి మిర్చీ, కాకరకాయ, అల్లం ధరలు అమాంతం పెరిగిపోయాయి. క్యారెట్, మిర్చీ, చిక్కుడు, బీర ధరలు సెంచరీ వైపు పరుగులు పెట్టగా మిగతా కూరగాయలు ఆఫ్ సెంచరీ దాటడంతో సామాన్యులు కొనలేక సతమతమవుతున్నారు. ఇక్కడి మార్కెట్‌లో అన్ని కూరగాయల ధరలు డబుల్, ట్రిబుల్ రేట్లు అయ్యాయి. వంకాయ కిలో రూ. 120, ఆలుగడ్డ రూ. 40, క్యాబేజీ రూ. 40, చిక్కుడు రూ.120, బెండకాయ రూ.80, బీర రూ.80, దొండకాయ రూ.60, క్యాప్సికమ్, బీట్‌రూట్ కిలో రూ.70 నుంచి 80 నైనే పలుకుతున్నాయి. మొన్నటివరకు కిలో రూ.30 ఉన్న టమాట ధర రూ.50, వెల్లుల్లి రూ.100, దోస రూ.50, పచ్చి బఠాణి రూ. 70, పాలకూర కిలో రూ.80, మెంతి కట్ట రూ.20లకు చేరింది. సొరకాయ, బీరకాయ రేట్లు భగ్గుమంటున్నాయి. కొన్ని రకాల కూరగాయలైతే వెతికినా అసలు మార్కెట్‌లోనే కనిపించడం లేదు. ఇక వీటితో పాటు ఆకుకూర ధరలు ఆకాశాన్నంటుతుండటంతో సామాన్యులు దిక్కులు చూస్తున్నారు. మరో 2నెలల వరకు కూరగాయల ధరలు ఇలాగే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. పెరిగిన కూరగాయల ధరలను చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. గతంలో కిలో కూరగాయలను తీసుకెళ్లే కస్టమర్లు ప్రస్తుతం అర కిలో, పావు కిలోతోనే సరిపెట్టుకుంటున్నారు. ఒకప్పుడు రూ.100 తీసుకెళ్తే సంచి నిండా కూరగాయలు వచ్చేవని, ప్రస్తుం 300లు తీసుకెళ్లినా పరిపడా వెజిటెబుల్స్ రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల కూరగాయల సాగు ఆశించినంత లేకపోవడంతో ప్రస్తుతం ఎన్నడూ లేనివిధంగా కూరగాయల ధరలు మండిపోతున్నాయంటున్నారు రైతులు. ధరల పెంపుపై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొండెక్కిన కూరలు కొనడం మానేశామంటున్నారు వినియోగదారులు. కూరగాయల ధరల పరుగుతో పేద ప్రజలకు ఇబ్బందులు అవుతున్నారు.



కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

● కుభీర్ తహసీల్దార్ బి.శివరాజ్

కుబీర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించాలని కుబీర్ తహసీల్దార్ బి. శివరాజ్ అన్నారు. సోమవారం కుబీర్ రైతువేదికలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్‌లకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అర్హులైన యువతీ, యువకుల వివరాలు సేకరిస్తూ ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. జాబితాలో కొట్టివేతలు, పొరపాటు లేకుండా పారదర్శకంగా తయారు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ వి. గంగాధర్, మాస్టర్ ట్రైనీ జి. రాజేశ్వర్, ఆర్ఐలు నరేష్, బి గంగాధర్ అత్తారోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కేజీబీవీల్లో మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు చర్యలు

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌టౌన్, జూలై14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కేజీబీవీ విద్యాలయాల్లో నాణ్యమైన విద్యాబోధనతోపాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, మరమ్మతులు, అదనపు మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు తదితర అంశాలపై తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు నివేదిక అందజేయాలని సూచించారు. అవసరమైన చోట ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా పనులు చేపట్టాలని, దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్షించిన కలెక్టర్ మండలాల్లోని పీహెచ్‌సీలకు అనుబంధంగా సబ్ సెంటర్ల నిర్మాణంపై ప్రణాళిక రూపొందించాలన్నారు. నిర్మాణంలో ఉన్న సబ్ సెంటర్ల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో రాజేందర్, కేజీబీవీ సమన్వయకర్త సలోమి కరుణత, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న పిట్టల రవీందర్

'ముదిరాజ్‌లకు జనాభాకు తగ్గ వాటా ఇవ్వాలి'

నిర్మల్ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు రాజకీయ రిజర్వేషన్లతోపాటు సామాజిక రిజర్వేషన్లు అయిన బీసీడీ నుంచి బీసీఏలోకి వెంటనే మార్చాలని ముదిరాజ్ అధ్యయన వేదిక అధ్యక్షుడు, మాజీ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో నిర్వహించిన ముదిరాజ్ జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ముదిరాజ్‌ల సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగిస్తే, ముదిరాజ్‌లు రాష్ట్ర జనాభాలో సుమారు 60లక్షల మంది ఉన్నారని, వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయపరంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. ముదిరాజ్‌లు అభివృద్ధి చెందాలంటే ముదిరాజ్‌లకు ప్రత్యేకమైన రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతీ చెరువులో 18ఏళ్ల నిండిన ముదిరాజ్ వ్యవసాయదారులకు సభ్యత్వాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. మత్స్యకారు సభ్యుత్వాల విషయంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జిల్లా మత్స్య అభివృద్ధి శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో రాబోయే పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ముదిరాజ్‌లు పోటీ చేసి, రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని ముదిరాజ్ రాజకీయ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు బొజ్జ నారాయణ ముదిరాజ్, సలేందర్ శివయ్య ముదిరాజ్, బోండ్ల గంగాధర్ ముదిరాజ్, బర్మ రాజనర్సయ్య ముదిరాజ్, అనిల్ ముదిరాజ్, కిష్టయ్య ముదిరాజ్, దర్శనం దేవేందర్ ముదిరాజ్, దినేష్ ముదిరాజ్, సంతోష్ ముదిరాజ్, ఉమామహేశ్వర్ ముదిరాజ్, తదితరులు ఉన్నారు.

కాల్వలో కుళ్లిన మాంసం విక్రయం

● సోషల్ మీడియాలో వైరల్

దిలావర్‌పూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ గ్రామంలో కుళ్లిన మాంసం విక్రయించడం కలకలం రేపింది. మాంసం అమ్మిన వ్యక్తిని గ్రామస్తులు అందరూ నిలదీసి మందలించారు. ఈనెల 12న ఆదివారం గ్రామంలో ఉన్న మాంసం విక్రయించే దుకాణం నుంచి గ్రామస్థులు మాంసాన్ని కొనుగోలు చేశారు. పలువురి ఇళ్ల నుంచి వంట చేస్తున్న సమయంలో కుళ్లిన వాసనతో గ్రామంలో దుర్వాసన వెదజల్లింది. ఈ విషయం వాట్సాప్‌లో విలేజ్‌గ్రూపులో వైరల్ అయ్యింది. దీంతో అప్పటికే దీన్ని గమనించని కొందరు తిన్ని అస్వస్థకు గురయ్యారు. దీంతో గ్రామ పెద్దలు మాంసం అమ్మిన వ్యక్తిని గ్రామ పంచాయతీ వద్దకు పిలిపించి విచారించగా శనివారం చనిపోయిన గొర్రెను కోసి ఫ్రిడ్జ్‌లో పెట్టి ఆదివారం గ్రామస్థులకు విక్రయించినట్లు తేలింది. తప్పు జరిగిందని, క్షమించాలని చెప్పడంతో గ్రామ పెద్దలు, గ్రామస్థులు హెచ్చరించి వదిలేశారు.



కుళ్లిన మాంసం అమ్మిన వ్యక్తిని మందలిస్తున్న గ్రామస్థులు



నీరు లేక వెలవెలబోతున్న వాగు

వరద పారలే.. వాగు పొంగలే!

● మండలంలో లోటు వర్షపాతం

కుభీర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల రైతులకు ఈ వానాకాలం అనుకూలించడం లేదు. గత ఏడాది ఇదే సమయంలో కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు, చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. అలుగుపారి వాగులు, వంకలు పొర్లిపొంగాయి. ఈ సీజన్‌లో ఆ పరిస్థితి లేదు. ముందస్తు వర్షాలకు మురిసిన రైతులు ఇప్పుడు దిగులు పడుతున్నారు. ఆడపదడప కురుస్తున్న చినుకులు మాత్రమే కురుస్తుండడంతో రైతుల్లో వనుకు మొదలవుతోంది. మండలంలో సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. వరుణుడిపై ఆశతో ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న, పసుపు, పంటలను సాగు చశారు. వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.

● పడిపోతున్న భూగర్భ జలాలు...

రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు తెలిపిన నివేదికల ప్రకారం వానాకాలం సీజన్ ప్రారంభం నుంచి జూలై 13వరకు 297.5 మి.మీ వర్షాపాతం మాత్రమే కురిసింది. ఈ సీజన్ ఆరంభమై 40 రోజులు పూర్తయిన లోటు వర్షాపాతమే నమోదవుతు వస్తోంది. ఇ లాగే ముందుకు సాగితే పంట నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని రైతు లు ఆవేదన చెందుతున్నారు. భూగర్భజలాల విషయానికొస్తే మండలంలో చాలా చోట్ల బోర్లు ఆగాగి పోతున్నాయి. మొలకలకు నీరందించడానికి అన్నదాతలు అనే పాట్లు పడుతున్నారు.

● కుభీర్ మండలంలో ఖరీఫ్ సాగు వివరాలు(ఎకరాల్లో)

మండలంలో మొత్తం 49వేల 600 సాగు విస్తీర్ణం ఉంది. ఈ ఖరీఫ్‌లో 22340 ఎకరాల్లో పత్తి, 245000 ఎకరాల్లో సోయాబీన్, 3000 ఎకరాల్లో కంది, 5000 ఎకరాల్లో పసుపు, మిశ్రమ పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల అంచనా.

సరిపోని బస్సులు.. ప్రయాణికులకు ఇబ్బందులు



తుకారం ఎక్స్‌రోడ్డు వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఉట్నూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఏజెన్సీలోని ప్రయాణికులకు సరిపడ బస్సులు లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో నాతుకారం ఎక్స్ రోడ్డు పాయింట్ వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు అక్కడ దిగి ఆసిఫాబాద్, నార్నూర్, గాదిగూడ, జైనూర్, లింగాపూర్, సిర్పూర్ (యు), జన్నారం, మంచిర్యాల, కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్,ఇచ్చోడ, గుడిహత్నూర్,బోథ్ ప్రాంతాలకు బస్సులలో వెళ్తుంటారు. ప్రయాణికుల రద్దీ అనుసరించి ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపించాల్సి ఉండగా చాలీనన్ని బస్సులు డిపోలో లేక పోవడంతో ప్రయాణికులకు సేవలు అంతగా అందడం లేదు. ఉట్నూర్ డిపోలో బస్సుల సంఖ్య పెంచి ప్రయాణికులకు రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని ఏజెన్సీ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

వాగు దాటి వైద్యం



వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

ఇంద్రవెల్లి , జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్ వైజర్ రాథోడ్ జలేందర్ ఆ ధ్వర్యంలో పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గౌరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిత్తాబట్ట గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు అడ్డంగా ఉండడంతో నీటి ప్రవాహంలో వాగునుదాటి వైద్యసిబ్బంది గ్రామానికి చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి రక్త నమూనాలు సేకరించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ గంగమ్మ, హెల్త్ ఏఎన్ఎంలు సంతోషిని, దేవిక, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాల

● అధ్యాపకుల సమష్టి ఫలితం... కళాశాల అభివృద్ధికి సోపానం ● ఫలితాల్లో స్టేట్ టాప్ టెన్‌లో దిలావర్‌పూర్‌కు చోటు ● యేటేటా పెరుగుతున్న అడ్మిషన్లు



కళాశాలలో అసెంబ్లీలో విద్యార్థులు, అధ్యాపకులు

దిలావర్‌పూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి అధ్యాపక బృందం, ప్రిన్సిపాల్ సమిష్టిగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించి సత్ఫలితాలిస్తోంది. దిలావర్‌పూర్ కళాశాల ఉత్తమ ఫలితాల సాధనలో స్టేట్ టాప్ టెన్ కళాశాలల్లో ఒకటిగా చోటు సంపాదించుకుంది. ఒకప్పుడు ప్రైవేట్ కళాశాలల్లో చదువు'కొనేందు'కు ఆసక్తి కనబరిచిన విద్యార్థుల మనసు మారింది. పిల్లలను ప్రైవేట్ కళాశాలల్లో చదివించడం గొప్పతనంగా భావించే తల్లిదండ్రులు ఇప్పుడు మాత్రం ప్రభుత్వ కళాశాలలే మేలన్న అభిప్రాయానికి వచ్చారు. ప్రైవేట్ కళాశాలల్లో చదువు'కొనే'బదులుగా అంకిత భావం, అనుభవం కలిగిన అధ్యాపకులున్న ప్రభుత్వ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఊరుకు దూరంగా.. ప్రకృతి సోయగాలకు దగ్గరగా!

అన్ని ప్రభుత్వ కళాశాలల్లో దిలావర్‌పూర్ ప్రభుత్వ కళాశాలకు ఒక ప్రత్యేకత ఉంది. రణగొన ధ్వనులకు దూరంగా పచ్చని పంట పొలాల మధ్య పచ్చదనంతో మనసును ఆహ్లాదపరిచే అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇట్టే ఆకట్టుకుంటుంది. విద్యార్థుల చదువులకు, అధ్యాపకుల బోధనకు ఎలాంటి ఆటంకం లేకుండా చదువులు సజావుగా సాగేందుకు అనువైన వాతావరణం కలిగి ఉంది.

35 మంది విద్యార్థులతో ప్రారంభమై..

ఇంతింతై వటుడింతై అన్న చందంగా 2001 విద్యాసంవత్సరంలో 35 మంది విద్యార్థులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం 350 మంది విద్యార్థులకు చేరుకుంది. కళాశాల మొదటి ప్రిన్సిపాల్ ఎంఏ జహీర్ కృషితో, అప్పటి గ్రామ పెద్దల సహకారంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సొంత భవనాన్ని సమకూర్చుకుని అంచెలంచెలుగా అభివృద్ధి



మొక్కలతో పచ్చదనం సంతరించుకున్న కళాశాల ప్రాంగణం



దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

చెందుతూ ఫలితాల్లో స్టేట్ టాప్ టెన్ కాలేజీల్లో చోటు సాధించి ముందుకు సాగుతోంది. అప్పటినుంచి ఇప్పటి వరకు వచ్చిన ఎనిమిది మంది ప్రిన్సిపాళ్ల కళాశాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేసిన వారే... ప్రస్తుత ప్రిన్సిపాల్ పి.సుదర్శన్ కళాశాల అభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మన్ననలను పొందుతున్నారు.

విద్యార్థుల మనోవికాసానికి మోటివేషన్ తరగతులు..

సాధారణంగా ప్రతీ విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే సాధారణ విద్యార్థులే చరిత్రను తిరగరాసే స్థాయికి చేరుకుంటారు. సరిగ్గా దాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు వివిధ అంశాల్లో నిష్ణాతులైన వక్తలతో ప్రతీ సోమవారం ఒక అంశంపై మోటివేషన్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఆహ్లాద కళాశాల - ఆరోగ్య కరమైన అలవాట్లు అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పొగ, మద్యం తాగడం వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా చదువుపై దృష్టి పెట్టేందుకు అధ్యాపకులు నిర్విరామంగా కృషి చేస్తున్నారు. ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మన ఆరోగ్యంపై మన అలవాట్ల ప్రభావాన్నిచక్కగా వివరిస్తూ విద్యార్థుల ఆరోగ్య జీవితానికి పునాది వేస్తున్నారు. మత్తు పదార్థాలకు ఆకర్షితులై విద్యార్థులు డిప్రెషన్‌కు లోను కాకుండా చదువు పట్ల ఆసక్తిని రేకెత్తించేందుకు కృషి చేస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకునేందుకు ప్రతీ నెల నిర్వహించే మోటివేషన్ తరగతులు ఉపయోగపడుతున్నాయి.

సామాజిక సేవా దృక్పథం పాదుకొల్పేందుకు..

విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక దృక్పథం ఉండాలన్న ఉద్దేశ్యంతో విద్యార్థుల్లో సామాజిక సేవను అలవర్చేందుకు కళాశాలలో ఉన్న ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు గ్రామాలకు వెళ్లి ఇంటింటికి తిరుగుతూ వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను సర్వే చేయడంతో పాటు వారికి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. చదువు విలువను వివరిస్తూ నిరాక్షరాస్యులకు అక్షరాలు నేర్పిస్తున్నారు. పారిశుద్ధ్యం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ సంవత్సరం శీతాకాలంలో మండలంలో ఏదో ఒక గ్రామాన్ని ఎంచుకుని ఆ గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి వారం రోజులపాటు అక్కడే బస చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివేందుకు అవసరమైన అనువైన వాతావరణాన్ని కల్పించి పరీక్షల్లో మంచి ఫలితాలు రాబట్టేందుకు అధ్యాపకులు సమన్వయంతో కృషి చేస్తున్నారు. కళాశాలలో ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 210 మంది విద్యార్థులు చేరడమే అధ్యాపకుల సమిష్టి కృషికి నిదర్శనం. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రతీ రోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాల ముగిసిన తర్వాత అధ్యాపకులు వంతుల వారీగా స్టడీ అవర్ పర్యవేక్షిస్తున్నారు. ప్రతీ రోజు ఓ గంటపాటు స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతీ వారం ఆ వారంలో పూర్తయిన సిలబస్‌పై వీక్లీ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఆ ప్రశ్న, జవాబు పత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరీక్షల్లో విద్యార్థులు చేసే తప్పులను వారికి వివరించి సరిదిద్దుతున్నారు. దీంతో పరీక్షలపై విద్యార్థులకు అవగాహన పెంచుకుని మెయిన్ పరీక్షల్లో తప్పులు చేయకుండా విద్యార్థులకు ఇప్పటి నుంచే శిక్షణ ఇస్తున్నారు. మంచి మార్కులు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలిస్తున్నారు. ముగిసిన విద్యా సంవత్సరంలో వార్షిక పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయి దిలావర్‌పూర్ ప్రభుత్వ కళాశాల టాప్ టెన్ కళాశాలల్లో స్థానం సంపాదించడం ప్రిన్సిపాల్, అధ్యాపకుల సమిష్టి కృషికి నిదర్శనం.

కళాశాల అనే ఫీలింగే లేదు..

- గాయత్రి, ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం



ఇంటర్ రెండో సంవత్సరం చదువుతు న్నా... మొదట్లో మా నాన్న ఈ కాలేజీలో చే ర్పించేందుకు ఇష్టపడలేదు. లెకల్చరర్లు ఉంటారో... ఉండరో... క్లాసులు చెబుతారో లేదోనన్న అనుమానం ఉండేది. కానీ కాలేజీలో చేరాక తెలిసింది. ప్రతీ రోజు క్లాసులు నడవడం, లెక్చరర్లు రావడం... పాఠాలు చెప్పడం, నోట్స్ చెక్ చేయడం, నాకైతే స్కూల్ ఫీలింగే ఉంది. లెక్చరర్లు ఫ్రెండ్లీగా ఉంటూనే చదువు విషయంలో కఠినంగా వ్యవహరిస్తారు. నాకు ఈ కాలేజీలో చదవడం అదృష్టం.

కాలేజీ అంటే మొదట్లో భయపడ్డా..

- మల్లీశ్వరి, బైపీసీ, ద్వితీయ సంవత్సరం



కాలేజీకి వెల్లుమంటే మొదట్లో నేను చాలా భయపడ్డా.. అందులోను ఇది కో-ఎడ్యుకేషన్ కాలేజీ కావడంతో చేరాలా వద్దా అనుకున్న కానీ మా ఇంటికి వచ్చిన మహిళా అధ్యాపకులు ఇచ్చిన ధైర్యంతో కళాశాలలో చేరా. ఇప్పుడు అంతా బాగుంది. మంచి అధ్యాపకులతో పాటు అన్ని మౌలిక సదుపాయాలున్నాయి. ఎలాంటి డిస్ట్రబ్ లేకుండా మంచి వాతావరణంలో చదువుకోగలుగుతున్నాం.

సమష్టి కృషితోనే కళాశాల అభివృద్ధి

- సుదర్శన్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, దిలావర్‌పూర్



నాతో పాటు మా అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బం ది మా అందరి కృషితోనే కళాశాలను అభివృద్ధి చేయడంతో పాటు ఉత్తమ ఫలితాలను రాబట్టగలుగుతున్నాం. రాష్ట్రస్థాయిలో మా కళాశాల టాప్ టెన్‌లో స్థానం సంపాదించడంతో మాపై బాధ్యత మరింత పెరిగింది. ఇకముం దు కూడా సిబ్బంది సహకారం తీసుకుంటూ మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తాం.

నాలుగంటే నాలుగే..!

● ఇచ్చోడలో నాలుగే రేషన్ కార్డులకు ఆమోదం

● అర్హులింతేనా అంటూ.. విస్తుపోతున్న జనం



ఇచ్చోడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాల సేవల్లో అంతరాయామో.. అధికారుల నిర్లక్ష్యమో.. తెలియదు గానీ బోథ్ నియోజకవర్గానికి మూల కేంద్రమైన ఇచ్చోడ మండలానికి కేవలం నాలుగంటే నాలుగే రేషన్ కార్డులకు ఆమోదం తెలిపారు ఇచ్చోడ మండల రెవెన్యూ శాఖ అధికారులు. ప్రభుత్వం ఆమోదించిన రేషన్ కార్డు సంఖ్యలో బోథ్ నియోజకవర్గం పూర్తిగా వెనుకపడింది. ఇచ్చోడ మండలంలో సభ్యుల జోడింపు అర్హులు 1033 మంది ఉండగా.. కేవలం నాలుగు రేషన్ కార్డులు మాత్రమే ఆమోదించడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్లనే కొత్త రేషన్ కార్డులు ఆమోదింపబడలేవని జారీ ప్రక్రియ అధికారుల అలసత్వం వహించకపోతే అమోదించబడిన రేషన్ కార్డుల సంఖ్య మరింత పెరిగి ఉండెదని పలువురు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కార్డుల కోసం, కుటుంబసభ్యుల పేర్లు చేర్పించడానికి కార్డుల విభజనకు ప్రజలు రెండు సార్లు దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లు కనిపించకపోవడంతో తిరిగి మీ సేవాలల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. నిత్యం దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాలకు, పౌరసరఫరాల శాఖ కార్యాలయాలనికి వెళ్లీ తమ రేషన్ కార్డుల గురించి అధికారుల చుట్టు తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఇచ్చోడ మండలంలో నాలుగు కార్డులకు మాత్రమే తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఆమోదం తెలపడం వింతగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మిగితా వారు వారి కార్డు స్టేటస్‌లను మీసేవ కేంద్రాలల్లో చూసుకుంటే పెండింగ్‌లో చూపించడం ఎంటనీ.. కొత్త కార్డు వస్తుందని ఎంతో ఆశతో పాత కార్డులో పేరు తొలగించుకుంటే మూడు నెలల బియ్యానికి దూరమయ్యారు. ఇప్పుడైన కొత్త కార్డు వస్తుందేమోనని తహసీల్దార్ కార్యాలయానికి చక్కర్లు కొడుతున్నారు దరఖాస్తుదారులు.

బోథ్ నియోజకవర్గం మండలాల వారీగా..

మండలం	కొత్త కార్డుల ఆమోదం	సభ్యుల జోడింపు
ఇచ్చోడ	- 4	1033
సోనాల	- 24	301
సిరికొండ	- 29	498
తాంసి	- 38	638
బోథ్	- 43	1336
నేరడిగొండ	- 85	486
బజార్‌హత్నూర్	- 132	938
భీంపూర్	- 173	780
తలమడుగు	-192	1073
గుడిహత్నూర్	- 358	1460

మరమ్మతులకు నోచుకోని అటవీశాఖ కార్యాలయం

● సిబ్బందికి తప్పని ఇబ్బంది



బోథ్ అటవీ శాఖ కార్యాలయంపై పారీలు కప్పుతున్న సిబ్బంది

బోథ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దాదాపు ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన పలు ప్రభుత్వ కార్యాలయాలు అవసాన దశకు చేరుకుంటున్నాయి. మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం అవసాన దశకు చేరుకుంది. పాత కార్యాలయానికి రేంజ్ అధికారి గదిని మరమ్మతులు చేయించి అందులో నిర్వహిస్తున్నారు. అయితే మిగతా చోట్ల మరమ్మతులు చేయించిన ఫలితం లేకుండా పోయింది. దీంతో విధులు నిర్వహించే సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

● వర్షాకాలం తప్పని తిప్పలు

వర్షాకాలం వచ్చిందంటే విధులు నిర్వహించే సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. కార్యాలయంలో సిబ్బందికి అనుగుణంగా వసతి లేకపోవడంతో వారి వారి రికార్డులను తడవకుండా ఉండడానికి ఇబ్బందులకు గురవుతున్నారు. సిబ్బంది పెరిగిన కార్యాలయం పాత భవనంలో ఉండడంవల్ల కొన్ని సమయాలలో ఆరు బయటనే సమావేశాలను నిర్వహించుకోవాల్సి వస్తుందని అటవీ శాఖ వారు వాపోతున్నారు.

● నూతన భవనం అవసరం

ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనం పురాతనమైంది కాగా దాని స్థా నంలో నూతన భవన నిర్మించాలని అటవీశాఖ వారు కోరుతున్నారు ప్రస్తుతం ఉన్న సిబ్బంది అవసరాలకు అనుగుణంగా కార్యాలయం నిర్మించి అధికారులకు నివాస గృహాలను సైతం సైతం నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.

సీరాల సాగు నీటి ప్రాజెక్టుపై రైతుల ఆశలు

● 90 శాతం పనులు పూర్తి

● రెండేళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు

● కాలువలకు మరమ్మతులు

భైంసా రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు తెగిపోయిన సీరాల ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. 1800ల ఎకరాల ఆయకట్టు రైతుల్లో సాగు నీటి ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పనులను పర్యవేక్షిస్తూ అధికారులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పనులను పరిశీలించి, అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పాత తూము స్థానంలో సిమెంట్‌తో కొత్తది నిర్మిస్తున్నారు. నిజాం కాలంలో 1902 లో రాతి, సున్నంతో నిర్మించిన పాత తూము లీకేజీలతో నీరు వృథాగా బయటకు వచ్చేది. భారీ వర్షాలతో తెగిపోయిన ఈ తూమును ఇప్పుడు నూతనంగా నిర్మించారు. సీరాల ప్రాజెక్టు నిర్మాణం ఈ ఏడాది పూర్తయి పంటలకు నీరు అందుతుందని ఆయకట్టు రైతులు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు.

రెండేళ్లుగా నీటి కోసం ఎదురుచూపు..

సీరాల ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో తానూర్ మండలంలోని గ్రామాలు బెంబరా, బోరిగాం, ఉమ్రి, భైంసా మండలంలోని గ్రామాలు ఇలేగాం, పాంగ్రి, మాంజ్రి, దేగాం గ్రామాల్లో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయి. ప్రాజెక్టులో నీరు నిలిచి ఉంటే భూగర్భ జలాలు పెరిగి తాగునీటి, సాగునీటి సమస్యలు తలెత్తేవి కావు.



మొరం కొట్టుకుపోకుండా బండరాళ్లను వేసిన దృశ్యం

కాలువలకు మరమ్మతులు..

తది దశలో ప్రధాన కట్ట పనులు టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. సీసీ డ్రైనేజీ నుంచి నీరు తూము ద్వారా కాలువలకు చేరే డిజైన్ చేశారు. తెగిపోయిన కట్టను చదును చేసి దాని అడుగు భాగంలో బండరాళ్లు పేర్చారు. చుట్టూ మట్టి, మొరం వేస్తున్నారు. ప్రధాన కట్ట నిర్మాణం చివరి దశలో ఉంది. భారీ టిప్పర్లతో మొరం, మట్టి వేస్తూ నీరు నిల్వ ఉన్నా కట్ట తెగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వందల ఏళ్ల క్రితం నిర్మితమైన సీరాల ప్రాజెక్టు భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసినా విపత్తు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది వర్షాకాలం ముందు పనులు పూర్తి చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పనులు తుది దశలో ఉన్న సమయంలో కాలువలపై దృష్టి సారించాలని ఇరిగేషన్ అధికారులను రైతులు కోరుతున్నారు. ఎనిమిది కిలోమీటర్ల సీసీ కెనాల్‌కు భారీ వర్షాల కారణంగా అనేకచోట్ల గండ్లు పడ్డాయి. కెనాల్‌లో మట్టి, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి, తూముల మరమ్మతులు చేపట్టాలి. సీరాల, ఇలేగాం గ్రామాల మధ్య కెనాల్ పూర్తిగా అధ్వాన్నంగా ఉంది. కాలువలపై శ్రద్ధ పెడితే పంట పొలాలకు నీరు సజావుగా అందుతుందని రైతులు తెలిపారు.

90 శాతం ప్రాజెక్టు పూర్తి కావడంతో ఆనందంగా ఉంది..

- గంగాధర్మ, రైతు



90 శాతం సీరాల ప్రాజెక్టు పూర్తి కావడంతో ఆనందంగా ఉంది. రైతులు ఈ సంవత్సరం భారీ వర్షాలు కురి స్తే సీరాల ప్రాజెక్టు నిండు కుండలాగా నిండుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం రెండు పంట లు పండిస్తామని రైతు సంతోషం వ్యక్తం చేశారు.

గత రెండు సంవత్సరాల నుంచి నష్టపోయాం..

- వాగ్మారే మాధవ్, రైతు



ఈ సంవత్సరం సీరాల ప్రాజెక్టు పూర్తి కావడంతో రెండు పంటలు పండుతాయని, గత రెండు సంవత్సరాల నుంచి నష్టపోయినా ఈ సంవత్సరం మేలు జరుగుతుందని రైతుసంతోషం వ్యక్తం చేశారు.

ఈయేడు నీరందిస్తాం: అనిల్, ఇరిగేషన్ ఈఈ

సీరాల ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నాయి. పనులు పూర్తి చేసి ఈ సీజన్‌లో రైతులకు నీరందించే విషయంపై దృష్టి పెడతాం. ఇప్పటికే ప్రధాన కట్ట పనులు చివరి దశకు చేరుకున్నారు. ప్రధాన తూము పనులు కొనసాగుతున్నాయి. ఆయకట్టు రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా చూస్తాం. త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.



- ఖానాపూర్ నుంచి చెల్గల్ వరకు హైవే విస్తరణ
- ఛత్తీస్‌గడ్‌తో నిర్మల్ జిల్లా రవాణా మార్గం
- కొత్త రోడ్డు కోసం రూ.750 కోట్ల కేటాయింపు
- ఖానాపూర్ నుంచి 7కిలోమీటర్ల పొడవుతో బైపాస్ మార్గం

61వ నెంబరు జాతీయ రహదారికి
లైన్ క్లియర్!

నిర్మల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ నుంచి జగిత్యాల జిల్లా చల్గల్ వరకు నిర్మించ తలపెట్టిన 61 నెంబరు జాతీయ రహదారి విస్తరణ పనులకు ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ (ఎంఒఆర్‌టీహెచ్) ఖానాపూర్ నుంచి బాదనకుర్తి మీదుగా జగిత్యాల జిల్లా చల్గల్ వరకు 54 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్న హైవే విస్తరణ పనుల కోసం రూ.750 కోట్లను కేటాయించింది. మహారాష్ట్రలోని కళ్యాణ్ నుంచి మొదలయ్యే నేషనల్ హైవే నెంబర్ 61 తెలంగాణ రాష్ట్రంలోని భైంసా, నిర్మల్, ఖానాపూర్ మీదుగా జగిత్యాల జిల్లా చల్గల్ వరకు కొనసాగనుంది. ఇక్కడ నిజామాబాద్ నుండి ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని జగదల్పూర్ వరకు గల నేషనల్ హైవే 63కు ఈ హైవే లింకేజీ కానుంది. దీంతో మహారాష్ట్రలోని కళ్యాణ్ నుండి ఛత్తీస్‌గడ్‌లోని జగదల్పూర్ వరకు ఈహైవే రోడ్డు మార్గం పూర్తిస్థాయిలో ఏర్పడనుంది. ప్రాథమిక సర్వే ద్వారా కేంద్రం ఈ నిధులను కేటాయించింది. దీంతో సంబంధిత నేషనల్ హైవే శాఖ అధికారులు డీపీఆర్ రూపకల్పనతో పాటు భూ సేకరణ, అటవీ, ఇతర అనుమతులు లాంటి వాటిని సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. డీపీఆర్ రూపకల్పన పూర్తయితే భూ సేకరణకు సంబంధించిన గెజిట్‌ను కూడా జారీ చేయనున్నారు.

ఖానాపూర్‌లో 7కి.మీ. పొడవుతో బైపాస్

నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు దాదాపు 35 కిలోమీటర్ల పొడవుతో నేషనల్ హైవే నెంబర్ 61 పనులను పూర్తిచేశారు. ఈ రోడ్డుపై ఏడు చోట్ల అండర్ పాస్ పనులు ప్రస్తుతం పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. ఈ అండర్ పాస్ పనులు పూర్తయితే ఇక ఖానాపూర్ వరకు హైవే పనులు దాదాపు పూర్తయినట్లే. ఇదిలా ఉండగా జగిత్యాల జిల్లా చల్గల్ వరకు విస్తరించనున్న ఈ రోడ్డు కోసం ఖానాపూర్ నుంచి బాదనకుర్తి వరకు బైపాస్ రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించారు. మొత్తం 7 కిలోమీటర్ల పొడవుతో ఈ బైపాస్ రోడ్డును నిర్మించనున్నారు. ఖానాపూర్ పట్టణానికి సమీపంలోని సాయిబాబా ఆలయం వెనుక నుంచి ఈ బైపాస్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ మార్గంలో అటవీ శాఖకు సంబంధించిన భూములున్న కారణంగా ఆ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే బైపాస్ రోడ్డు కోసం భూసేకరణ కూడా చేపట్టాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

డీపీఆర్ తర్వాతే పనులు షురూ..

ఖానాపూర్ నుంచి చల్గల్ వరకు విస్తరించనున్న హైవే పనుల కోసం డీపీఆర్‌లను రూపొందించాల్సి ఉంది. నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు చేపట్టిన హైవే పనులకు సంబంధించిన డీపీఆర్‌ను బియాన్ సంస్థ చేపట్టింది. ఈ రోడ్డు విస్తరణ పనులకు కూడా ఇదే సంస్థ డీపీఆర్ రూపొందించనుంది. అనుమతులు రాగానే సంబంధిత శాఖ భూసేకరణకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. నిర్మల్ జిల్లాలో 7కిలోమీటర్లు, జగిత్యాల జిల్లాలో 47 కిలో మీటర్ల పొడవుతో భూములను సేకరించాల్సి ఉంటుంది.





రహదారి విస్తరణకు నిధులు మంజూరు

- ఆర్ఆర్. సుభాష్, డీఈ, నేషనల్ హైవే

కళ్యాణ్ నుంచి ఖానాపూర్ వరకు నిర్మించిన నేషనల్ హైవే నెంబర్ 61ని జగిత్యాల జిల్లా చల్గల్ వరకు విస్తరించేందు కేంద్రప్రభుత్వం అనుమతులిచ్చింది. 53 కిలోమీటర్ల పొడవుతో ఖానాపూర్ నుంచి చల్గల్ వరకు నిర్మించ తలపెట్టిన ఈ నేషనల్ హైవే రోడ్డు కోసం రూ.75 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఖానాపూర్ పట్టణంలో 7కిలోమీటర్ల పొడవుతో బైపాస్ రోడ్డును నిర్మించనున్నాం. డీపీఆర్ ప్రతిపాదనలు రూపొందగానే భూసేకరణ ప్రక్రియ చేపట్టనున్నాం. మహారాష్ట్రలోని కళ్యాణ్ నుంచి నిర్మల్, ఖానాపూర్ మీదుగా జగిత్యాల జిల్లా చల్గల్ వరకు హైవే 61 విస్తరించనుంది. దీంతో ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి లింకేజీ ఏర్పడనుంది.



డయల్ వాహనాలతో పోలీసులు

అత్యవసర సేవల వేగవంతానికి కొత్త పుంతలు

- డయల్ 100 వాహనాలకు జీపీఎస్ పరికరాల అమరిక
- జీపీఎస్ అమరికతో మరింత సమర్థవంతంగా మారనున్న డయల్ 100 సేవలు: ఎస్పీ

నిర్మల్‌రూరల్, జూలై14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసింగ్‌లో పారదర్శకతను పెంపొందించడమే లక్ష్యంగా జిల్లాలో నడుస్తున్న మొత్తం 100 డయల్‌వాహనాలకు నూతన జీపీఎస్ పరికరాలను అమర్చినట్లు ఎస్పీ జానకీ షర్మిల సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఆధునిక టెక్నాలజీ సహాయంతో అత్యవసర పరిస్థితుల్లో ఘటనా స్థలానికి పోలీసులు వేగంగా చేరుకోగలుగుతారన్నారు. వాహనాల గమ్యం, చలనం, స్థితి వంటి సమాచారం రియల్ టైమ్‌లో జిల్లా కంట్రోల్ రూమ్‌కు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. పోలీస్ వ్యవస్థను ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా ఇది కీలకమైన అడుగని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్,జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణలో మూడు రోజుల క్రితం అనారోగ్యంతో రాజవ్వ మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం ఇన్‌చార్జీ కోరిపెల్లి రామ్‌కిషన్‌రెడ్డి పరామర్శించి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యుడైన ఉట్ల రాజేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయనవెంట నాయకులు జీవన్‌రావు, శంకర్, కొట్టింటి మల్లేష్, రాంరెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఫిర్యాదులపై తక్షణ చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై తక్షణమే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి చట్ట అమలును తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ ప్రక్రియ ఇప్పటికే 55 శాతం పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన భాగాన్ని తక్షణమే పూర్తిచేసి, నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో రెండోదశ జ్వర సర్వే 34 శాతం పూర్తయినట్లు పేర్కొంటున్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్ష కిట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామని, ఎంపీడీవోలు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. మండలాల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని అన్నిశాఖల పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసలు పొందిన జిల్లా మహిళా సంఘాలను కలెక్టర్ అభినందించారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలం తాండ్ర(జి) గ్రామానికి చెందిన రైతు సందుపట్ల రాజేశ్వర్‌కు మల్బరీ ఆకుల సాగుకు షెడ్ నిర్మాణానికి సిల్క్ సమగ్ర-2 పథకం కింద రూ. 4.50 లక్షల వ్యయంతో తొలి విడతగా రూ. 93,775 సబ్సిడీ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వినూత్నంగా ఆలోచించి కొత్తపంటల సాగుచేసి, అధిక లాభాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌రూరల్, జూలై14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శనగర్ ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న టవర్ పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సోఫీనగర్, కేజీబీవీ గురుకుల హాస్టల్, ఇందిరమ్మ కాలనీ, డిమార్ట్, సాగర్ కన్వెన్షన్, సిద్దాపూర్ వాటర్ వర్క్స్, విద్యానగర్ కాలనీ, మంచిర్యాల ఎక్స్‌రోడ్, ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రిపురం, ఆస్రా కాలనీ, ఈద్‌గాం, భాగ్యనగర్, ఫిష్ మార్కెట్, సిద్దాపూర్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా కురన్నపేట్ ఏరియాలో 11 కేవీ కురన్నపేట్ లైన్లలో గల చెట్లను తొలగించేందుకుగాను ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3:30 గంటల వరకు కురన్నపేట్ ఎస్సీ కాలనీ, వార్డు నెంబర్ 18 ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సమ్మక్క-సారలమ్మ భూమిని కాపాడండి

- తహసీల్దార్‌కు ఎడ్‌బిడ్ తండా గ్రామస్థులు వినతి

ముథోల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో సమ్మక్క-సారలమ్మ ఆలయం భూములను కాపాడాలని ఎడ్‌బిడ్ తండా గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. ఆలయభూమిని అక్రమంగా పట్టా చేసుకొని సాగు చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. ఈ ఆలయ భూమిని కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టర్ వినతి

నిర్మల్‌రూరల్, జూలై14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గుర్తింపు లేకుండా కొనసాగుతున్న పాఠశాలలను పూర్తిగా రద్దు చేయాలని ప్రగతీ శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ... ప్రభుత్వ గుర్తింపు లేకుండా జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయని జిల్లాలోని విద్యాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు తీసుకొని ప్రభుత్వ గుర్తింపు లేకున్నా కూడా అడ్మిషన్లు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నాయని మండిపడ్డారు. తమ పాఠశాలలో అడ్మిషన్ చేసుకున్న విద్యార్థులకు వేరే ప్రాంతంలోని ఇతర వాళ్ల బ్రాంచీలకు సంబంధించిన పాఠశాల నుండి సర్టిఫికెట్లు అందజేస్తూ ప్రభుత్వాన్ని, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని కొండాపూర్ ప్రాంతంలో గల శ్రీ చైతన్య హైస్కూల్, పట్టణంలోని నారాయణ హైస్కూల్ పాఠశాలలు ఇలాంటి ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని తెలిపారు. ఇవి రెండే కాకుండా ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలను తక్షణమే పూర్తిగా రద్దు చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరినట్లు, ఈ విషయం పట్ల జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పవార్‌కిరణ్, జిల్లా సహాయ కార్యదర్శి రాజా, నాయకులు సిద్ధార్థ్ అద్వైత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ముంపు ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ పర్యటన

- ప్రజలకు జాగ్రత్తలపై అవగాహన

దస్తురాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందం (ఎన్డీఆర్ఎఫ్) మండలంలోని వరద ముంపు ప్రాంతాలైన దేవునిగూడెం, మున్యాల్, గొడిసిర్యాల్ గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని నది తీర ప్రాంతాలు, లోతట్టు భూములను సందర్శించిన ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రజలందరితో మాట్లాడి వారిని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ప్రాణభయ పరిస్థితుల్లో ఎలా స్పందించాలి.. ఎలాంటి పరిస్థితుల్లో వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.. ఏవి తీసుకుని వెళ్లాలో వంటి అంశాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.పాఠశాలలు, పంచాయతీ భవనాల వంటి ప్రాంతాల వివరాలను ముందుగానే గుర్తుంచుకోవాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతున్నట్లయితే తక్షణమే అప్రమత్తం కావాలని, అధికారుల సూచనలకు అనుగుణంగా కదలికలు సాగించాలని ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రజలకు సూచించారు. అలాగే సహాయక చర్యల కోసం ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నంబర్లు, రెస్క్యూ టీంల డీటెయిల్స్ వంటి సమాచారాన్ని కూడా ప్రజలతో పంచుకున్నారు. ప్రజల సహకారంతోనే విపత్తులను సమర్థంగా ఎదుర్కోగలమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐలు రచన, ఆర్తి పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బృందం

ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి

సోన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సోన్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉపాధిహామీ 4వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2024-2025లో 14 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను వివరించగా, ఏడాదిలో రూ. 4కోట్ల 30లక్షల పనులను చేపట్టామని, టీఏలు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.7,228 రికవరీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ మేనేజర్ సుధాకర్, సోషల్ ఆడిట్ అధికారి వెంకన్న, ఎంపీడీవో సురేష్, ఎంపీవో కలీం, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారులు

తప్పుల్లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ బత్తుల విశ్వంబర్

దస్తురాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలని తహసీల్దార్ బత్తు విశ్వంబర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం మండలంలో బీఎల్‌వోలకు ఓటరు నమోదు, తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు జగన్, రాందాస్, డిప్యూటీ తహసీల్దార్ యాదవ్ రావు, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐలు రచన, ఆర్తి, హెచ్‌హెచ్‌పీ రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఫెయిల్యూర్ అనేది సక్సెస్‌కు అడ్డం కాదు

- నేర్చుకునే తీరుతోనే విజయానికి బీజాలు
- విద్యార్థులతో ముఖాముఖిలో వైస్ చాన్స్‌లర్ ప్రొ. గోవర్ధన్

బాసర, జూలై14 (ఆంధ్రజ్యోతి): ఫెయిల్యూర్ అనేది సక్సెస్‌కు అడ్డు కాదని, అదొక అనుభవంగా తీసుకుంటే విజయానికి తొలిమెట్టని వీసీ ప్రొ.గోవర్ధన్ అన్నారు. బాసర ఆర్జీయూకేటీలో సోమవారం వీసీ ప్రొ.గోవర్ధన్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఓఎస్డీ ప్రొ. మురళీదర్శన్‌తో కలిసి విద్యార్థులతో సుదీర్ఘంగా మాట్లాడారు. అభ్యాసం, ఆత్మవిశ్వాసం, సాహసం, దృక్పథం వంటి కీలక అంశాలపై ప్రేరణాత్మక సందేశమిచ్చారు. ముఖ్యంగా కంఫర్ట్‌జోన్, ఫీయర్‌జోన్, లెర్నింగ్‌జోన్, గ్రోత్‌జోన్ అనే జీవన దశలను వివరించారు. ఆర్జీయూకేటీ ఒక లెర్నింగ్‌జోన్ విద్యార్థుల అభ్యాసానికి, అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ దశలో విద్యార్థులుగా నేర్చుకునే తీరు భవిష్యత్ విజయానికి బీజాలు వేస్తుందని వివరించారు. అపజయాలకు భయపడకుండా స్వీకరించాలని, వాటినే మార్గదర్శకంగా తీసుకొని ముందుకు సాగాలని చెప్పారు. విజయం సాధించాలంటే నిరంతర కృషి, స్థిరత్వం, ఆత్మవిశ్వాసం ముఖ్యమని వివరించారు. సగటు విద్యార్థులు కూడా అసాధారణ విజయాలు సాధించగలరని, ముఖ్యంగా ధైర్యం, దృఢసంకల్పంతో ఎదగగలరని చెప్పారు. పర్సెప్షన్(దృక్కోణం) మారితే.. ఆచరణ మారుతుందన్నారు. వీసీ తన స్వీయ విజయ ప్రయాణాన్ని, ఎదురైన సవాళ్లు వాటిని అధిగమించిన విధానాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రొ. మురళీదర్శన్, అసోసియేట్ డీన్‌లు విఠల్, డా.నాగరాజు, వివిధ విభాగాల విభాగాధిపతులు, పరీక్ష విభాగ అధికారి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



వీసీతో ముఖాముఖిలో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న వీసీ

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



గంగాధర్ (ఫైల్)

భైంసా రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేండ్‌పల్లి గ్రామానికి చెందిన తేకల గంగాధర్ సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేండ్‌పల్లి గ్రామానికి చెందిన తేకల గంగాధర్ (25) కూలీ చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత కొద్ది రోజుల నుంచి ఆరోగ్య సమస్యలతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం తన ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఆర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శంకర్ తెలిపారు. మృతుడికి ఒక పాప ఉంది.

కారు ఢీ.. వ్యక్తికి గాయాలు

నర్సాపూర్(జి), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డుప్రమాదం జరిగింది. కుబీర్ మండలం మాలేగాం గ్రామానికి చెందిన దేవానంద్, తన అన్న మాదవ్‌తో కలిసి నిర్మల్ నుంచి మాలేగాంకు బైక్‌పై వెళ్తున్నాడు. పెట్రోల్ బంకు దగ్గర బైకును ఆపి నిలబడి ఉండగా నిర్మల్ వైపు నుంచి భైంసా వెళ్తున్న ముథోల్ గ్రామానికి చెందిన పెద్ద కరోళ్ల యోగేష్ తన కారుతో వెనుక నుంచి దేవానంద్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దేవానంద్ తల, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దేవానంద్ నర్సాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

దస్తురాబాద్‌లో దొంగతనం

దస్తురాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోచమ్మవాడలోని సంగీత అనే మహిళ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. స్థానిక ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తలుపులను పగలగొట్టి ఇంట్లోకి చొరబడి రెండు ల్యాప్‌టాప్‌లు, సిలిండర్, బెడ్‌షీట్లు ఎత్తుకెళ్లినట్లు సంగీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. క్లూస్ టీంను రప్పించి పలు ఆధారాలను సేకరించారు.



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు